సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 20 । మే । 2024



మహా ప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

బ్రహ్మంగారి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. -8లో



ఘాట్‌లో తప్పిన ఘోర ప్రమాదం

హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డుపై ఆదివారం ఘోర ప్రమాదం తప్పింది. డ్రైవర్ సమయ స్ఫూర్తిగా వ్యవహరించకుండా ఉంటే 25 మంది ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.8/25.6

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.6 – 38.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 'నో డ్రోన్ ఫ్లై జోన్'

కడప అర్బన్: కడప నగర శివార్లలోని మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచిన నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో 'డ్రోన్ నో ఫ్లై జోన్'గా ప్రకటిస్తున్నట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామనీ డీఎస్పీ హెచ్చరించారు. ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందనీ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవీఎంలు భద్రపరిచిన భవనం చుట్టు ప్రక్కల 'నో డ్రోన్ ఫ్లై జోన్'గా ప్రకటించినట్లు కడప డీఎస్పీ తెలిపారు.

వెల్లాలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాజుపాళెం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే స్వాముల వారికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన పూజలు చేశారు. ఆదివారం అంకురార్పణము, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈఓ బీవీ నరసయ్య పూజల్లో పాల్గొన్నారు. భక్తులు స్వాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, రామమోహన్ రెడ్డి, కమిటీ సభ్యుడు ఆనంద్ పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవుని కల్యాణం: వెల్లాలలోని సంజీవరాయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల కల్యాణం సోమవారం జరగనున్నట్లు ఆలయ చైర్మన్ జగదీశ్వర రెడ్డి తెలిపారు.రాత్రి శేష వాహనంపై స్వామి,అమ్మవార్లను ఊరేగించనున్నారు.

22న తిరువన్నామలైకి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: అరుణాచలగిరి ప్రదక్షిణ కోసం ఈనెల 22వ తేదిన తిరువన్నామలైకి రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి రాత్రి 8 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో రూ. 1072గా చార్జి నిర్ణయిచినట్లు చెప్పారు. బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, మరో బస్సు అదే సమయంలో పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళుతుందన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసులో రూ. 1566, సూపర్ లగ్జరీలో రూ. 1475 చార్జి ఉంటుందన్నారు. మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6 గంటలకు, మరో బస్సు సాయంత్రం 6 గంటలకు మైదుకూరు నుంచి కడప, రాయచోటి మీదుగా వెళుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో రూ. 1414, 1188గా చార్జి ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఇంద్ర ఏసీ బస్సు కడప మీదుగా వెళుతుందన్నారు. ఇందులో రూ. 1569 చార్జి ఉంటుందన్నారు. జమ్మలమడుగు నుంచి రాత్రి 8.00 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ. 1352గా ఉందన్నారు. పులివెందుల డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బస్సు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు సర్వీసు వెళుతుందన్నారు. ఇందులో రూ. 1242 టిక్కెట్ ధరగా నిర్ణయించారన్నారు.

హెచ్ఐవీని నిర్మూలిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మృతి చెందిన వారిని స్మరించుకుంటూ ఆదివారం కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఐటీఐ సర్కిల్ వద్దగల మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ ఏడాది మనం ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం ...వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దామన్న నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. డీఐఓ ఉమామహేశ్వర రావు, డీపీఓ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞాన దీప్తి.. సమున్నత కీర్తి!

నందలూరు అనగానే ఐఏఎస్‌లకు ప్రసిద్ధి అనే నానుడి నేటికీ కొనసాగుతోంది. ఐదుగురు ఐఏఎస్‌లను ఈ దేశానికి అందించిన ఘనతను సాధించుకుంది. ఇది ముందు తరం మాట.. 40 ఏళ్ల తర్వాత ఐఏఎస్‌లను అందించే ఒరవడి మళ్లీ మొదలైంది. మరోసారి ఐఏఎస్‌ల ఊరుగా కీర్తిని కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- ఐఏఎస్‌ల ఊరుగా నందలూరు ప్రసిద్ధి
- మట్టిలో మాణిక్యాలు.. విద్యాధరి, ధీరజ్, గొబ్బిళ్ల శ్రీవాస్తవ
- 40 ఏళ్ల తర్వాత .. మళ్లీ సివిల్స్ శకం మొదలు
- బహుదానది నీరు విజ్ఞానానికి నెలవు





పాతతరం ఐఏఎస్‌లను అందించిన నందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ (ఇన్‌సెట్) నందలూరు రైల్వేకేంద్రం

రాజంపేట: చెయ్యేటి ఒడ్డున ఉన్న నందలూరు. బహుదా(చెయ్యేరు) నది నీరు విజ్ఞానానికి నెలవన్నాడు ఓ రచయిత... అందుకే నందలూరు నీళ్లు ఇక్కడి వారు మేధావులుగా తయారు కావడానికి కారణమనే భావన నేటికీ కొనసాగుతోంది.. జిల్లాలో వందకుపైగా సంవత్సరాలు పూర్తి చేసుకున్న నందలూరు జిల్లా పరిషత్ హైస్కూలు అప్పట్లో ఒకే ఒక్క హైస్కూల్ కావడం విశేషం. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల్లో ఐదుగురు ఐఏఎస్‌లు అయ్యారు. జి.జగత్పతి, ఏ.ఉమాకాంతశర్మ, తిరువెంగళాచార్యులు, ఆకేపాటి విజయసాగర్‌రెడ్డి, పెద్దరెడ్డయ్యలు వివిధ రాష్ట్రాలలో ఐఏఎస్‌లుగా సేవలందించారు. మరొకరు ఐఏఎస్ కావాలని కృషిచేసిన ఆర్‌సీరెడ్డి చివరికి ఐఏఎస్‌ల సృష్టికర్తగా మారారు.

ఒక్కొక్కరి గురించి ఇలా..

జగత్పతి: ఈయన స్వస్థలం మండలంలో నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ కేంద్రం. బీహార్ రాష్ట్రానికి చీఫ్‌సెక్రటరీగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు.

ఉమాకాంతశర్మ: ఈయన స్వస్థలం నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ కేంద్రం. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చీఫ్‌సెక్రటరీగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు.

ఏవీఎస్‌రెడ్డి: ఈయన స్వస్థలం నందలూరు మండలంలోని పాటూరు గ్రామం. ముందుగా మిలిటరీలో పనిచేశారు. బంకర్లలో చదువుకొని ఏవీఎస్‌రెడ్డి ఐఏఎస్ అయ్యారు. ఏపీకి ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. ఎన్నికల పరిశీలకుడుగా పనిచేశారు. ఈయన హయాంలోనే నియోజకవర్గాల పునర్విభజన జరిగింది.



ఏవీఎస్‌రెడ్డి జెటీ ఆచార్యులు ఆర్‌సీరెడ్డి

జెటీ ఆచార్యులు: ఈయన స్వస్థలం మండలంలోని నాగిరెడ్డిపల్లె దళితవాడ. ఈయన కూడా తమిళనాడు చీఫ్‌సెక్రటరీగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు.

పెద్దరెడ్డెయ్య: పెనగలూరు మండలంలోని నారాయణ నెల్లూరు స్వస్థలం. అయితే నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు. ఈయన కూడా వివిధ హోదాలలో పనిచేశారు.

ఐఏఎస్‌ల సృష్టికర్త ఆర్‌సీరెడ్డి: పట్టుదలతో ఐఏఎస్ కావాలనుకున్న ఆర్‌సీరెడ్డి స్వస్థలం నందలూరు గ్రామంలోని ఈదరపల్లె. ఢిల్లీలో జర్నలిస్టుగా పనిచేశారు. ఏఐసీసీలో సభ్యునిగా కొనసాగారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీతో సత్సంబంధాలు ఉన్నాయి. ఐఏఎస్ రాలేదని నిరాశపడకుండా ఐఏఎస్ స్టడీ సర్కిల్ స్థాపించి, ఎందరో ఐఏఎస్‌లను తయారు చేశారు. ఐఏఎస్‌ల సృష్టికర్తగా నిలిచారు.

నేటి తరం నుంచి..



విద్యాధరి ధీరజ్‌కుమార్ కృష్ణశ్రీవాస్తవ్

గత ఏడాదిలో.. రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్, వైద్యురాలు విజయభారతి దంపతుల కుమారుడు డాక్టర్ బి.ధీరజ్ కుమార్ తల్లిదండ్రుల బాటలో వైద్య విద్యను ఎస్వీ మెడికల్ కళాశాలలో అభ్యసించారు. 2019 బ్యాచ్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

గత యేడాది అక్క...ఈ యేడాది తమ్ముడు

నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలోని గొల్లపల్లెకు చెందిన గొబ్బిళ్ల సుబ్బరామయ్య, సుజాతమ్మ దంపతుల ఏకైక కుమార్తె గొబ్బిళ్ల విద్యాధరి ట్రిబుల్‌ఐటీలో చదువుకున్నారు. తండ్రి మరణానంతరం చెన్నైకు చేరుకున్నారు. అక్కడే సివిల్స్‌లో కోచింగ్ తీసుకున్నారు. మూడో (2022) ప్రయత్నంలో సివిల్స్‌లో 211వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం కందుకూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్నారు

- విద్యాధరి సోదరుడు గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్ సివిల్ సర్వీసెస్‌లో 444వ ర్యాంక్ సాధించారు. ఐఎఫ్ఎస్‌లో 52వ ర్యాంకు సాధించారు.

ఐఏఎస్‌ల పురిటిగడ్డ



నందలూరు నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు అయ్యారు. 40 ఏళ్ల తర్వాత మళ్లీ ఐఏఎస్‌ల శకం మొదలైంది. నందలూరు వాసిగా నాకెంతో గర్వంగా ఉంది. ఈ పరంపరను నందలూరు విద్యార్థులు కొనసాగించాలి. నేటి తరంలో సివిల్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యాధరి , దీరజ్, కృష్ణశ్రీవాస్తవ్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలి.
- మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు

మేధావులకు నిలయం



చెయ్యేరు నీళ్లు తాగేవారు మహాతెలివిపరులంటుంటారు. బహుదా(చెయ్యేరు) నీరు విజ్ఞానానికి నెలవనేది అక్షరసత్యం. ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్–1 లాంటి హోదాలను తమ ఖాతాల్లో వేసుకున్నారు నందలూరు వాసులు. సివిల్స్ విజేతలను స్ఫూర్తిగా తీసుకొని నందలూరు యువతీ యువకులు ముందుకెళ్లాలి. – భూమన శంకర్‌రెడ్డి, ఆర్‌సీ రెడ్డి సోదరుడు, నాగిరెడ్డిపల్లె, నందలూరు

టెన్త్ సప్లిమెంటరీకి సన్నద్ధం

- ఈ నెల 24 నుంచి జూన్ 3వరకు పరీక్షలు
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని వారికి నిర్వహించే సప్లమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ విద్యార్థులను కూడా రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించనున్నారు. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలను చేపట్టారు.

3528 మంది విద్యార్థులు

జిల్లాలో ఈ ఏడాది మార్చి 18వ తేదీ నుంచి జరిగిన పరీక్షలను 27729 మంది రాయగా ఇందులో 25538 మంది ఉత్తీర్ణతసాధించారు. 2191 మంది వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించిన వారితోపాటు గతంలో ఫెయిలైన ప్రైవేటు విద్యార్థులతో కలిసి మొత్తం 3528 మంది వివిధ సబ్జెక్టుల్లో పరీక్షలను రాయనున్నారు.

అత్యధికంగా గ్రూపు సబ్జెక్టుల్లోనే...

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అత్యధికంగా గ్రూపు సబ్జెక్టులే రాయనున్నారు. ఇందులో ఫిజికల్ సైన్స్ 2020, బయలాజికల్ సైన్స్‌లో 2020, మ్యాథ్స్‌లో 1529 మంది పరీక్షకు హాజరుకానున్నారు. అలాగే ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగులో 957 మంది, సెకండ్ లాంగ్వేజ్‌లో 325 మంది, థర్డ్‌లాంగ్వేజ్ ఇంగ్లీషులో 542 మంది, సోసియల్ స్టడీస్‌లో 766 మంది పరీక్షల రాయనున్నారు.

16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు: సప్లమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను పరీక్షల విభాగం వారు ఆయా పాఠశాలలకు పంపించారు. ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఫెయిలైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పరీక్షలకు సంసిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.



కడప గాంధీనగర్ స్కూల్లో సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయురాలు

తేదీ	పరీక్ష	పరీక్ష రాసే విద్యార్థులు
24	తెలుగు	957
25	హిందీ	325
27	ఇంగ్లిషు	542
28	గణితం	1529
29	ఫిజిక్స్	2020
30	బయాలజీ	2020
31	సోషల్ స్టడీస్	766

సిబ్బంది నియామకం..

పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతోపాటు ఇన్విజిలేటర్ల నియామకం దాదాపు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి వసతి కల్పించారు. విద్యుత్ సరఫరాకు ఆటకం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నియామకం పూర్తి



సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన సిబ్బంది నియామకం దాదాపు పూర్తి చేశాం. పశ్నపత్రాలు రానున్నాయి. ఇవి రాగానే ఆయా పోలీసు స్టేషన్లలో భద్ర పరుస్తాం. రెగ్యులర్ మాదిరిగానే సప్లిమెంటరీ పరీక్షలను కూడా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను చేస్తున్నాం
– వెంకటేశ్వర్లు, ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్

పకడ్బందీగా నిర్వహిస్తాం



పది సప్లమెంటరీ పరీక్షలను కూడా రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఫర్నీచర్, తాగునీరు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇది ముమ్మాటికి తప్పుడు కేసే

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు క్రైం: ఎన్నికల కమిషన్ ఏపక్షంగా వ్యవహరించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనపై కేసు నమోదైన సంఘటనపై శ్రీకాళహస్తిలో ఉన్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆదివారం రాత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఇది నూటికి నూరు శాతం తప్పుడు కేసు అని అన్నారు. రామేశ్వరంలో నవీన్ అనే యువకుడిని కౌన్సెలింగ్ పేరుతో పోలీసులు స్టేసన్‌కు తీసుకొని వెళ్లారన్నారు. అతని తల్లిదండ్రులు తన వద్దకు రావడంతో సీఐతో మాట్లాడేందుకు శనివారం వన్‌టౌన్ స్టేషన్‌కు వెళ్లినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు ముగిసిన తర్వాత వైఎస్సార్‌సీపీ వాళ్లనైనా, టీడీపీ కార్యకర్తలనైనా స్టేషన్‌కు పిలిపిస్తే వాళ్ల తల్లిదండ్రులు భయపడతారు కాబట్టి.. ఏ సంబంధం లేని వాళ్లను పిలిపించవద్దని సీఐతో చెప్పానన్నారు. అవసరమనుకుంటే ఎమ్మెల్యే అభ్యర్థులమైన తనను, వరదరాజులరెడ్డిని, ఇతర ద్వితీయ శ్రేణి నాయకులను పిలిపిస్తే సరిపోతుందని ఒక ప్రజాప్రతినిధిగా సూచన మాత్రమే చేసి అక్కడి నుంచి వచ్చానని చెప్పారు. అంతేగానీ సీఐని బెదిరించడం గానీ, ఆయన విధులకు ఆటంకం కలిగించలేదని, స్టేషన్‌లో ఉన్న నవీన్‌ను తన వెంట తీసుకెళ్లలేదని తెలిపారు.

నేను బెదిరించానని సీఐ శ్రీకాంత్ భగవద్గీతపై ప్రమాణం చేయగలరా..

తనను బెదిరించానని సీఐ శ్రీకాంత్ భగవద్గీతపై ప్రమాణం చేయగలరా అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. సోమవారం సీఐ మీడియా సమావేశం నిర్వహించి తాను స్టేషన్‌కు వచ్చి బెదిరించి, విధులకు ఆటంకం కలిగిండంతో పాటు నవీన్‌ను తన వెంట తీసుకెళ్లానని ప్రమాణం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. భగవద్గీతపై ప్రమాణం చేసి ఇదంతా నిజమని చెబితే తాను మౌనం దాలుస్తానని, లేదంటే మాత్రం సీఐ అంతరాత్మకే వదిలేస్తానని తెలిపారు. ఇది నూటికి నూరు శాతం కంచే చేను మేసినట్లు పోలీసులే తప్పుడు కేసులు నమోదు చేయడమేనని అన్నారు. ప్రొద్దుటూరులో చిన్నపాటి అవాంఛనీయ సంఘటన కూడా చోటు చేసుకోకుండా ఎన్నికలు జరిగాయంటే అది ప్రజాప్రతినిధుల గొప్పదనం అన్నారు. దాన్ని గుర్తించకుండా తమపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరైనా ఎన్నికల సమయంలో గొడవలు పెట్టుకుంటారు గానీ ఎన్నికలయ్యాక స్టేషన్‌కు వెళ్లి పోలీసులను బెదిరించాల్సిన అవసరం ఏముందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇది చాలా అన్యాయమని, సమాజంలో తన గౌరవాన్ని భంగం కలిగించేలా చేస్తున్నారన్నారు.

ఏకపక్షంగా ఎన్నికల కమిషన్ వ్యవహారం

ఈనాడు పత్రికలో రాశారని ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసే కార్యక్రమంలో భాగంగా సీఐ శ్రీకాంత్‌తో తనపై ఫిర్యాదు ఇప్పించారన్నారు. సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు ఆయనను బెదిరించి నవీన్ అనే యువకుడిని స్టేషన్ నుంచి తీసుకెళ్లినట్లు తనపై 353, 506 సెక్షన్ల కింద వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు చేశారని ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు.

జిల్లా అంతటా వర్షం

- అత్యధికంగా పెండ్లిమర్రిలో 39.4
- అత్యల్పంగా పెద్దముడియంలో 0.8 మిల్లీ మీటర్ల వర్షం

కడప ఎడ్యుకేషన్: ఉపరితల ఆవర్తనం వల్ల శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జిల్లాలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ మండలాల మినహా మిగతా అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా పెండ్లిమర్రిలో అత్యధికంగా 39.4 మిల్లీమీటర్ల వర్షం కురువగా పెద్దముడియంలో అత్యల్పంగా 0.8 మిల్లీమీటర్లు కురిసింది. ఈ వర్షం రైతన్నలకు వేసవి దుక్కులను చేసుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. మరో చిన్న వర్షం కురిస్తే పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసుకునేందుకు వీలవుతుందని పలువురు రైతులు చెబుతున్నారు.



మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
పెండ్లిమర్రి	39.4	చెన్నూరు	6.4
వేముల	32.2	మైలవరం	6.4
జమ్మలమడుగు	25.2	వీఎన్‌పల్లె	6.4
దువ్వూరు	24.2	చక్రాయపేట	6.0
చాపాడు	19.2	గోపవరం	5.6
సీకేదిన్నె	18.4	సింహాద్రిపురం	4.6
ఎర్రగుంట్ల	17.2	ఖాజీపేట	4.2
కమలాపురం	16.2	అట్లూరు	4.0
ముద్దనూరు	12.2	తొండూరు	3.6
లింగాల	12.2	ప్రొద్దుటూరు	2.4
రాజుపాలెం	8.6	మైదుకూరు	2.2
బద్వేల్	8.2	వేముల	2.0
వల్లూరు	7.6	బీమఠం	2.0
కడప	7.4	బి.కోడూరు	1.2
పులివెందుల	7.2	సిద్ధవటం	1.0
ఒంటిమిట్ట	7.0	పెద్దముడియం	0.8

క్లుప్తంగా

టపాకాయలు స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన టపాకాయలు

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని ఫ్యాన్సీ స్టోర్‌లో ఆదివారం రూ.50 వేల విలువగల టపాకాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు. వీరపునాయునిపల్లెకు చెందిన జనార్దన్‌గుప్తా అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌బి హెడ్‌కానిస్టేబుల్ చలమారెడ్డి, సిబ్బంది తనిఖీలు నిర్వహించారన్నారు. టపా కాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో గుర్తుతెలియని యువకుడు ఆదివారం తెల్లవారు జామున మృతిచెందాడు. శనివారం రాత్రి వర్షం కురవడంతో అతడు చెట్టు కింద నిలబడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. తెల్లవారి చూసే సరికి చెట్టు కింద ఉన్న బెంచీపై విగతజీవిగా పడి ఉన్నాడు. అతడి వద్ద సెల్‌ఫోన్, ఇతర ఆధారాలు లేకపోవడంతో స్థానికులు బద్వేల్ రూరల్ ఎస్‌ఐ రవికుమార్‌కు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉండవచ్చని, జీన్స్ ప్యాంట్, టీషర్ట్ ధరించి ఉంటాడని, ఆచూకీ తెలిస్తే ఎస్‌ఐ రవికుమార్ సెల్ నెంబర్ 9121100628కు సమాచారం ఇవ్వాలన్నారు.

రెండు దుకాణాల్లో రూ.70వేలు చోరీ

రామాపురం : మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో శనివారం రాత్రి రెండు దుకాణాల్లో రూ.70 వేలు చోరీ చేసినట్లు ఎస్‌ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసులు వివరాల మేరకు.. లక్కిరెడ్డిపల్లె క్రాస్ రోడ్డు లోని ఆర్‌ఎంపీ వైద్యులు గంప వెంకటరమణ మెడికల్ షాప్, బాదుల్లాకు చెందిన స్వీట్ బేకరీ షాప్ తాళాలు పగులగొట్టి దుండగులు లోపలికి చొరబడి రూ.70 వేలు చోరీ చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహా ప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

- ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మహాప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : 'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీ పడ్డారు. బ్రహ్మంగారి మఠంలో ఆరు రోజుల పాటు వైభవంగా కొనసాగిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం మధ్యాహ్నం బియ్యం, బెల్లం, నెయ్యి, జీడి పప్పు, ద్రాక్ష, యాలక్కలు, ఎండుకొబ్బరి, పాలు తదితరాలతో మహా ప్రసాదాన్ని తయారుచేశారు. గర్భాలయంలో స్వామి ఎదురుగా.. రాశిలా పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మఠం ఫిట్ పర్సన్ సి.శంకర్ బాలాజీ, పూర్వపు మఠాధిపతి కుమారులు ప్రసాదం పంపిణీ ప్రారంభించారు. స్వామి ప్రసాదం స్వీకరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి మహా ప్రసాదానికి ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాప్రసాదం విశిష్టత

మహా ప్రసాదం అనగా గొప్ప ప్రసాదం అని అర్థం. దేవతలకు నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేస్తారు. తమిళనాడులోని శివాలయాల్లో విభూదిని ప్రసాదంగా అందజేస్తారు. అమ్మవారి ఆలయాల్లో కుంకుమ ఇస్తారు. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో 'విశేష గుడాన్నం' అందిస్తారు. దీనిని స్వీకరించిన వారి కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ప్రసాదాన్ని ఎండబెట్టి, నిల్వ చేసి సుమారు రెండు నెలల వరకు భక్తులకు అందజేస్తారు.

ఉత్సాహ భరితంగా ఉత్సవం

ఉదయం ఉత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి, పీఠంపై అధిష్టింపజేసి విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగించి తిరిగి పెద్దమఠం చేర్చారు. కడపకు చెందిన అమృతమ్మ, వెంకటసుబ్బయ్య శ్రేష్టి, లక్ష్మీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. తెల్లవారు జామున సుప్రభాతం, నామ సంకీర్తనం చేసి అనంతం స్వామి, అమ్మవారి అర్చనా మూర్తులను అభిషేకించారు. ప్రత్యేకంగా అలంకరించి సహస్ర నామార్చన జరిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి కుమారులు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఆలయ ప్రాంగణంలో భారీగా భక్త జనం

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి



మాట్లాడుతున్న విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి

ప్రొద్దుటూరు క్రైం : దండకారణ్యంలో ఆదివాసులపై ఏర్పాటు చేసిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అడవుల్లో నిక్షిప్తమైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో దాదాపు 115 మంది చనిపోయారన్నారు. ప్రజలను రక్షించాల్సిన ప్రభుత్వమే డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా కాల్పులు జరుపుతూ గిరిజనులను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం సభ్యురాలు పద్మ, పీకేఎస్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నజీర్, సీపీఐ నాయకుడు సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వలరాజు, బీఎస్పీ నాయకుడు జయరాం, మాలమహానాడు నాయకుడు మురి, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకురాలు హరిత, న్యాయవాది దాదాహయత్, జహంగీర్, రచయిత మహమూద్, తదితరులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరికి కుంకుమార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను అలంకరించి రావణబ్రహ్మ వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన పట్టాభిరామ బృందం నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



రావణ బ్రహ్మ వాహనంపై గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి



కోలాటం వేస్తున్న మహిళలు

దాడిపై కేసు నమోదు

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ మల్లూరు క్రాస్ వద్ద నివాసముండే శివారెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఆయన కథనం మేరకు.. స్థానిక తాగు నీటి కుళాయి వద్ద చిన్నప్ప, శివారెడ్డి గొడవపడ్డారన్నారు. గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేశారన్నారు. అయినా శివారెడ్డి ఇంటిపై శనివారం చిన్నప్ప అనుచరులు మారణాయుధాలతో దాడికి దిగారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

మేయర్ సురేష్‌బాబు ఇంట విషాదం

గుండెపోటుతో అన్న కుమారుడు ఆనంద్‌బాబు మృతి



ఆనంద్‌బాబు(ఫైల్)

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె.సురేష్ బాబు కుటుంబంలో విషాదం నెలకొంది. మేయర్ అన్న కుమారుడు ఆనంద్‌బాబు (39) గుండెపోటుతో మృతిచెందాడు. ఆదివారం తెల్లవారుజామున ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అరుణాచల హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాలుగు గంటలకు కన్నుమూశారు. పసుపు వ్యాపారిగా ఉన్న ఈయనకు భార్య, చిన్న వయసు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చేరుకుని ఆనంద్‌బాబు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆనంద్‌బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఘాట్‌లో తప్పిన ఘోర ప్రమాదం

ముందుంది భారీ మలుపు.. ఉన్నపాటుగా బ్రేక్ వేసి అదుపు చేయాలనుకున్న డ్రైవర్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.. బ్రేక్ క్లచ్ కిందకు వెళ్లి.. పైకి రాకుండా అలాగే ఉండిపోయింది. దీంతో వాహనం వేగంగా వెళ్తోంది... డ్రైవర్ చాకచక్యంగా ముందున ఓ బండరాయిని ఢీకొని ముందుకు వెళ్లకుండా ఆపాడు.. దీంతో 25 మంది ప్రాణాలతో క్షేమంగా బయటపడ్డారు.

- ప్రొద్దుటూరు మలుపు వద్ద కొండను ఢీకొన్న మినీ బస్సు
- బ్రేక్ ఫెయిల్ అయినా డ్రైవర్ చాకచర్యంతో అంతా క్షేమం



హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు ప్రొద్దుటూరు మలుపు వద్ద కొండను ఢీకొన్న మినీ బస్సు



ప్రమాదం తర్వాత ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న పర్యాటకులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం తప్పింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించకుండా ఉంటే 25 మంది ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. సంఘటన వివరాలు ఇలా..

రాయచోటి నియోజకవర్గం చిన్నమండెంకు చెందిన 25 మంది పర్యాటకులు ఆదివారం ఓ ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సులో హార్సిలీ హిల్స్ వచ్చారు. కొండపై ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. పచ్చని చెట్ల కింద సేదతీరారు. అనంతరం సాయంత్రం చిన్నమండెంకు తిరుగు ప్రయాణమయ్యారు. డ్రైవర్ ఖాదర్‌వలి మినీ బస్సును నెమ్మదిగా కిందకు తీసుకువస్తున్నాడు. కొండ ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన ప్రొద్దుటూరు మలుపు సమీపానికి వస్తుండగా వేగం తగ్గించేందుకు బ్రేక్‌పై కాలుపెట్టారు. దీంతో క్లచ్ పూర్తిగా కిందకు వెళ్లి మళ్లీ పైకి రాలేదు. బ్రేక్ ఫెయిల్ అయినట్టు గ్రహించిన ఖాదర్‌వలి మినీ బస్సు నిలిపేందుకు గేర్ మార్చి మొదటి గేర్‌కు వేశాడు. ఆగకపోవడంతో హ్యాండ్‌గేర్ ఉపయోగించినా ఫలితం లేకపోయింది. ఇంతలో ప్రొద్దుటూరు మలుపు ఎదురుగా కనిపించింది. మలుపు కుడి వైపున మినీబస్సును తిప్పితే పల్లంగా రోడ్డుపై మినీ బస్సు ఆగకుండా వేగంగా ముందుకు వెళ్తుంది. దీంతో ప్రమాదాన్ని నివారించడం కోసం ఖాదర్‌వలి మినీబస్సును మలుపువైపుకు తిప్పకుండా నేరుగా ఇనుప గ్రిల్ ఉన్న చోట ఎదురుగా తీసుకెళ్లి ఢీకొట్టించే ప్రయత్నం చేశాడు. దీంతో బస్సు గ్రిల్ అంచున దూసుకెళ్లి కొండ బండరాళ్లను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో పెనుప్రమాదం తృటిలో తప్పింది. ఇదే మలుపు వద్ద 60 ఏళ్ల క్రితం పెళ్లి బస్సు ప్రమాదానికి గురై అంతా దుర్మరణం చెందారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించకపోతే తీవ్ర ప్రాణ నష్టం జరిగి ఉండేది. బస్సు ప్రమాదానికి గురికావడంతో పర్యాటకులంతా కొండ కిందకు కాలినడకన చేరుకున్నారు. తర్వాత మదనపల్లె నుంచి కొండపైకి వచ్చి తిరిగి వెళ్తున్న బస్సులో ఎక్కిన పర్యాటకులు అంగళ్లు వెళ్లి అక్కడి నుంచి చిన్నమండెం వెళ్లారు.



డ్రైవర్ ఖాదర్‌వలి

ప్రభుత్వ ఆస్పత్రిలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

మదనపల్లె: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మదనపల్లెలోని శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న నేపథ్యంలో అత్యవసర సేవలకు సంబంధించి ఆదివారం ఎస్‌పీజీ అధికారులు డాగ్, బాంబ్ స్క్వాడ్ నిపుణులతో కలిసి ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వీవీఐపీ రూమ్‌ను పరిశీలించారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న నేపథ్యంలో అత్యవసర సేవలకు సంబంధించి జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసినట్లు ఎస్‌పీజీ అధికారులు తెలిపారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు



గాయపడిన ప్రకాష్

ములకలచెరువు : ఆటో ఢీ కొనడంతో ద్విచక్రవాహన దారుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీటీయం మండలం కాట్నగల్లు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రకాష్(38) ములకలచెరువుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో స్థానిక రైల్వే గేటు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రకాష్‌ను కుటుంబసభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ముగ్గురికి..

మదనపల్లె : వివాహ శుభ లేఖలు పంచేందుకు ద్విచక్రవాహనంలో వెళ్తున్న వారిని టిప్పర్ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని బురకాయలకోటకు చెందిన సాహెబ్ పీర్(32), బంధువు కలికిరికి చెందిన హఫీజుల్లా(45) కలిసి వారి బంధువు వివాహ శుభలేఖలు పంచేందుకు ద్విచక్రవాహనంలో కలికిరి నుంచి మదనపల్లె మీదుగా పుంగనూరుకు వెళ్తున్నారు. మరో ద్విచక్ర వాహనంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్న రాజశేఖర్(58) వీరికి సమీపంలో వెళ్తున్నారు. వలసపల్లె పంచాయతీ పరిధిలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ఈ రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ప్రమాదంలో సాహెబ్‌పీర్, హఫీజుల్లా, రాజశేఖర్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు ఆటోల్లో క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజశేఖర్ తిరుపతికి వెళ్లగా, సాహెబ్‌పీర్, హఫీజ్‌ఖాన్ వేలూరు సీఎంసీకి వెళ్లారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మరొకరికి..

కలకడ : కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. కలకడ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి వివరాల మేరకు.. కలకడ మండలం గంగిరెడ్డిగారిపల్లె హరిజనవాడ గ్రామానికి చెందిన మండెం చలపతి తన ద్విచక్ర వాహనంలో కలకడకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. కలకడ హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో చలపతికి గాయాలయ్యాయి. 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో కేబుల్ నిర్వాహకుడు మృతి



మృతి చెందిన రామకృష్ణారెడ్డి

బి.కొత్తకోట : డిష్ కేబుల్ వైర్ సరిచేస్తుండగా విద్యుత్తు షాక్ తగలడంతో డిష్ నిర్వాహకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం ఉదయం బి.కొత్తకోట మండలం ఓబిరెడ్డిగారిపల్లెలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం కాయలవాండ్లపల్లెకు చెందిన జి.రామకృష్ణారెడ్డి(40) స్వగ్రామంలో ఆర్‌కే సిటీ నెట్‌వర్క్ పేరుతో కేబుల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓబిరెడ్డిగారిపల్లెలో కేబుల్ తీగ గాలికి ఒరిగిందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో రామకృష్ణారెడ్డి శివాలయం వద్ద స్తంభంపైకి ఎక్కి కేబుల్ వైర్‌ను సరిచేస్తున్నాడు. ఆ సమయంలో రామకృష్ణారెడ్డి ఎడమ చేతి బొటన వ్రేలు విద్యుత్ తీగకు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు శ్రీనివాసులురెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన ధ్రువీకరించారు. మృతుడి భార్య రోషణ అలియాస్ పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్టు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజుగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టమాట ధరలకు రెక్కలు

నిత్యం వంటకు వాడే టమాటా ధరలకు రెక్కలు వచ్చాయి. వారం రోజుల కిందట కిలో రూ.12 నుంచి రూ.14 ఉన్న ధర వారం రోజుల్లోనే 50 శాతానికి పెరిగింది. మండుతున్న ఎండలు, పలుచోట్ల అత్యధిక వర్షాలకు పంట కొన్ని చోట్ల పంట దెబ్బతినడమే ఇందుకు కారణం. జిల్లా వ్యాప్తంగా ప్రసుతం 820 మెట్రిక్ టన్నులకు మించి నిల్వలు రావడం లేదని, రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు.

- మార్కెట్లో కిలో టమాటా రూ.28
- 820 టన్నులకు పడిపోయిన నిల్వలు
- 50 శాతం పెరిగిన టమాటా ధరలు
- రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం



గుర్రంకొండ : జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ యార్డు కమిటీ పరిధిలో ప్రస్తుతం 8567 ఎకరాల్లో టమాటా పంట కోతకు వచ్చింది. నెల రోజులుగా రాయలసీమ జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయినా, అన్నమయ్య జిల్లాలోని పడమటి మండలాల్లో కొంత మెరుగ్గా ఉంది. రాయలసీమ వ్యాప్తంగా ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు పంట రాకపోవడంతో పడమటి మండలాల్లో సాగు చేసిన పంటకు డిమాండ్ పెరిగింది. గత ఏడాదితో పోల్చితే ఎండలు ఎక్కువగా ఉండడంతో తోటలను కాపాడేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఎండలకు టమాటాలపై బొబ్బలు ఏర్పడి మెత్తబడి పోతున్నాయి. దీంతో బయట రాష్ట్రాలకు తరలించే అవకాశం లేకుండాపోతోంది.

పుంజుకొంటున్న ధరలు

జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందట 25 కిలోల టమాటా క్రేట్ రూ.300 నుంచి రూ.350 పలుకుతోంది. కిలో టమాటా రూ.12 నుంచి రూ.14 వరకు లభ్యమయ్యేది. తాజాగా మార్కెట్లో ధరల పుంజుకోవడంతో 25 కిలోల క్రేట్ ధర రూ.700కు మించి పలుకుతోంది. మార్కెట్‌లో కిలో టమాటా రూ.28టుంది. రెండో రకం కిలో రూ.20, మూడో రకం రూ.14 పలుకుతోంది.

మార్కెట్‌లో పడిపోతున్న నిల్వలు

జిల్లాలో నెల రోజుల కిందట మార్కెట్‌కు 1530 మెట్రిక్ టన్నుల టమాటా నిల్వలు వచ్చేవి. పంటలు దెబ్బతినడంతో తాజాగా 820 మెట్రిక్ టన్నులు మాత్రమే మార్కెట్లకు వస్తోంది. రాబోయే రోజుల్లో ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు స్టాకు ఉంచుకొనే పరిస్థితి లేదు. దీనికితోడు రానున్న రోజుల్లో వర్షాలు పడే సూచనలు ఉండడంతో టమాటాలు దెబ్బతినే అవకాశముంది. ఈ నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశముంది.

గత వారం రోజుల్లో జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన నిల్వల వివరాలు ఇలా ఉన్నాయి

తేది	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25 కిలోల క్రేట్)
మే 13	682	రూ.350
14	764	రూ.400
15	785	రూ.550
16	810	రూ.450
17	790	రూ.545
18	642	రూ.680
19	820	రూ.700

వర్షాలకు దిగుబడి తగ్గింది



ఎండలు ఎక్కువగా ఉండడం, మరో వైపు వర్షాలకు టమాటా దిగుబడి తగ్గిపోతోంది. ఇదే ధర పెరగడానికి కారణం. జిల్లాలో ప్రస్తుతం 720 మెట్రిక్ టన్నుల నిల్వలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఎండలు, వర్షాల ప్రభావంతో రాబోయే రోజుల్లో టమాటా ధరలు మరింత పెరిగే అవకాశముంది.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం